కథ

# మార్పు

**అంధకారం అలుముకున్న నా మనసులా, పవర్‌కట్ కావడంతో ఆ వీధంతా చీకటిగానే ఉంది. ఆ రాత్రి చల్లగాలికి ఒక్కదాన్నీ డాబాపై కూర్చున్నాను. పిల్లతెమ్మెరలు వీస్తూ గిలిగింతలు పెడుతున్నా నాలో, నా మనసుకు ఏ స్పర్శా లేదు. ఆయనకు తనపైని ప్రేమ రాహిత్యాన్ని తట్టుకోలేని మనసు బ్రతుకుపై నిరాశను పెంచుతోంది. రేడియోలో పాటలొస్తున్నాయి.**

ఈ సమయంలో ఎంత చక్కని పాటలు వేస్తారు రేడియోలో. మొన్నటికి మొన్న ఘంటసాల వర్ధంతికి రేడియోలో ఘంటసాల గురించి ప్రత్యేక కార్యక్రమం, గంటవరకు మంత్ర ముగ్ధుల్ని చేసే వ్యాఖ్యానంతో ఎంత అద్భుతంగా ఉందో! అన్ని పాటల్ని భావయుక్తంగా, మనసులోనే ఉండేలా చేయగలగడం ఆ గానగంధర్వుడికే సాధ్యమేమో..ఆ పాటల అర్థాలు మాత్రం సూటిగా గుండెల్లోకే చొచ్చుకుపోయేవి. అప్పటి పాత పాటలు ఏవి విన్నా..అలా వింటూనే ఉండిపోవాలనిపిస్తుంది. హాస్యమైనా, ప్రేమయినా..భావమేదైనా శృతిమించక సున్నితంగా స్పృశించేలా ఉండేవి. ఇప్పుడలాంటివేవీ? గుండె భయంతో జారెత్తేలా దడ, దడ చప్పుళ్ళు, అర్థం పర్థంలేని భావం, మొహాలే కనిపించకుండా గెంతులు.

"దీపాలు వెలిగె..పరదాలు తొలిగె..ప్రియురాలు పిలిచె రావోయి.." పాట నాకెంత ఇష్టమైన పాటైనా శూన్యంగా ఉన్న మనసును రంజింపజేయలేకపోతుంది. ఈ పాటలన్నీ అంటే..ఆయనెంత చెవికోసుకునేవారు. ఎన్ని చిలిపి మాటలతో నన్నలరిస్తూ పాటలు పాడేవాడు. కానీ ఇప్పుడు నా మనసుని శృతి చేసే తీరిక ఆయనకెక్కడిది? ముందు ముందిలా అవుతుందనే ఆ తీపి గుర్తులు నెమరేసుకోవాలనే అప్పుడలా ప్రవర్తించారేమో? అప్పుడు కూడా ఇప్పటిలా పట్టీపట్టనట్లుగా ఉంటే తనకి ఇంత తేడా తెలిసేది కాదేమో! ఇంత బాధపడేదీ కాదేమో! ఏమిటో..పంచ భక్ష్య పరామాన్నాల రుచి చూపించి అలవాటయ్యాక, ఒకేసారి పచ్చడి మెతుకులు వేసినట్లుంది తన పరిస్థితి. 'వీణ మీటితే పలికేది రాగం- ఎదమీటితే పలికేది అనురాగం' ఆ అదృష్టం తనకుండొద్దు.

సముద్రాలు దాటి ప్రయాణిస్తే వాతావరణంలో మార్పు వస్తుంది. కాని ఆత్మలో రాదు. ఆయన విషయంలో అదే జరుగుతుంది. మనిషి మనసులో ఉత్సాహం అణగారితే దాన్ని మించిన అశాంతి ఎక్కడా లేదు.

ఏ ఫంక్షన్‌కైనా నేను లేకుండా వెళ్ళలేకపోయేవారు. "నాకెవరూ ముక్కు, మొహం తెలియదు. మీ ఆఫీస్ స్టాఫ్ మధ్య నేనెందుకు?" అంటే, "అంతా మేడమ్‌ని తీసుకురండి, అన్నారు. పైగా నువ్వు రాకపోతే నాకేం బావుండదు. ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడోయ్ ఎంజాయ్ చేసేది. దేన్నైనా సాధించవచ్చునేమోగాని, గడిచిపోయిన కాలాన్ని తిరిగి సాధించలేము" అంటూ లాక్కెళ్ళేవారు.


ఇప్పుడదంతా ఏమయ్యిందో! మొన్న వాళ్ళాఫీసు నుండి రమేష్ వచ్చి మరీ, మరీ చెప్పి వెళ్ళాడు. వాళ్ళ పాప బర్త్‌డేకి సార్‌తో తప్పక నేను కూడా రావాలని. 'సరే' అన్నాను. నాక్కూడా చాలా సంతోషం అన్పించింది. ఈమధ్య ఏ ఫంక్షన్స్ అయినా ఆఫీస్‌లోని వాళ్ళవి అయినా ఇదివరకటిలా నన్ను తీసుకెళ్ళడం లేదు కాబట్టి వాళ్ళు నన్ను రమ్మనటంలేదేమో అనుకున్నాను. ఇతనింటికొచ్చి చెప్పాడు కనుక తప్పక తీస్కెళతారనుకుని, ఏ చీర కట్టుకోవాలితో సహా సెలెక్ట్ చేసి పెట్టుకుని, నిన్న నోరు విడిచి తనే "ఇవ్వాళే అనుకుంటా కదండీ రమేష్ ఇంట్లో ఫంక్షన్" అంటూ అడిగితే "ఆ..నేను, రవీందర్ వెళ్దామనుకుంటున్నాము" అన్నారు. స్టన్నయ్యాను. అయినా ఆ అబ్బాయి వచ్చి పిల్చిన సంగతి అతనికి తెలీదేమోనని, "నన్ను తప్పక రమ్మని పిల్చాడండీ" అంటూ అభిమానం విడిచి అంటే ఏమన్నాడు? "అవునా..నేను, ఆఫీస్‌లోని రవీందర్‌తో కల్సి వెళ్దామనుకున్నాను. అయినా నువ్వెందుకు లెద్దూ.." అంటూ ఇబ్బందిగా మొహం పెట్టాడు. గిర్రున తిరిగిన కన్నీళ్ళను అతికష్టంపై అణచుకుంటూ, మౌనంగా తలూపాను.

పిల్లలు చిన్నవాళ్ళయినా తీరకుండా పని ఉండేదేమో! ప్రొద్దున్నే హడావుడిగా టిఫిన్, భోజనం అన్నీ తయారుచేస్తే పిల్లలిద్దరు స్కూళ్ళకు, ఆయన ఆఫీసుకు వెళ్ళిపోతారు. అప్పట్నుంచి వాళ్ళొచ్చేంతవరకు సందడే ఉండదు. ఇంట్లో బియ్యం చేయడమూ, ఏదో ఒకటి కుట్టడమో, దిండ్లపై పెయింటింగో ఏదో ఒకటి చేస్తూ తాను బిజీగానే ఉన్నా, మనసు మాత్రం మారాం చేస్తూ చెరగని ముద్రలుగా ఉన్న గత జ్ఞాపకాలు తిరగతోడి, అసహ్యకరమైన మరకలుగా మిగులుతున్న నేటి ధోరణికి తట్టుకోలేక మౌనంగా రోదిస్తుంది.

తనీమధ్య ఈ ఆలోచనలతో మూడీగా ఉండటం చూసి పిల్లలిద్దరు, "ఏంటమ్మా అదోలా ఉన్నావు? ఆరోగ్యం బాలేదా" అంటూ అడిగిన అభిమానానికే ఎందుకో దుఃఖం తన్నుకొచ్చింది. అయినా తమాయించుకుని "ఏమీ లేదురా! కాస్తంత తలనొప్పి అంతే" అంది. అదే ఈమాత్రం స్వాంతనైనా ఆయన దగ్గర్నుండి లభిస్తే ఎంత పొంగిపోయేది. కనీసం పిల్లలు గుర్తించిన విషయాన్ని కూడా ఆయన గుర్తించలా! అవునూ, అయినా అంత తీరిక ఆయనకెక్కడిది? ప్రొద్దున్న హడావుడిగా తొమ్మిది గంటలకు గడప దాటితే మళ్ళీ రాత్రి తొమ్మిది గంటలకే ఇల్లు చేరేది. అలసి వచ్చి స్నానం, భోజనం కానిచ్చేసరికి పది దాటిపోతుంది. ఇంకా నన్నేం పట్టించుకుంటారు? భార్యాభర్తలు సంసార రథానికి చక్రాలన్నారే..మరి ఏంటో..నా జీవితం తెరచాపలేని పడవ ప్రయాణంలా ఉంది. చూసేవారికి చందమామలా ఉంది. 'ఏం బాధమ్మా..హాయిగా అన్నీ తెచ్చిపెడుతుంటే వండిపెట్టడానికి' అనిపిస్తుంది. కాని నాకు మాత్రం అసంతృప్తిగానే అనిపిస్తుంది. 'జీవితం ఒక ప్రయాణం లాంటిది. మంచి భర్త తోడుంటే మార్గాయాసమే కనిపించదు.' ఎందుకీ సంపాదన? ఇవి చేజారిపోయిన కాలాన్ని, జారవిడుచుకుంటున్న అనుభూతుల్ని, కోల్పోతున్న ఆత్మీయతానురాగ విలువల్ని తెచ్చివ్వగలవా? నాలో రగులుతున్న సుడుల అలలు ఆయనకెన్నటికి అర్థం అయ్యేను?

ఇంట్లో బోరుగా ఉంది, అంటే ఉద్యోగం చేయమంటారు. తనకే ఇష్టం లేదు. టైంపాస్‌కి జాబ్ అంతగా అవసరం లేని తాను చేసే బదులు, అది మరొకరిని ఆదుకుంటుందనిపిస్తుంది. పైగా అసలే తండ్రి పట్టించుకోక సగం ప్రేమకు దూరమౌతున్న పిల్లలకు, తనూ జాబ్ చేస్తూ, ఆ బిజీలో పిల్లలను ప్రేమరాహిత్యానికి గురిచేయడం నాకిష్టం లేదు. 'చిన్నారుల మేథ తోట వంటిది. నాటిన విత్తనాల్లోంచి కలుపు మొక్కలుగానో, మంచి మొక్కలుగానో పెరుగుతాయి. కాని తవ్వి తీసేందుకు రెండూ కష్టమైనవే.'

ఆ మధ్య తమ 'మ్యారేజ్‌డే'కి టైటానిక్ సినిమాకెళ్ళాలని అనుకున్న సంగతి ఆయనకు తెలుసు. కాని ఇంకా మ్యారేజ్ డే రెండు రోజులుందనగానే ఆఫీస్‌లో వాళ్ళు బలవంతం చేసి తీసుకెళ్ళారని, చూసి వచ్చి చెపితే నిజంగా నిశ్చేష్టురాల్నే అయ్యాను. కొలీగ్స్‌తో సినిమాకెళ్ళినందుకు కాదు. ఇరవై వసంతాలు దాటిన నా వైవాహిక జీవితంలో ఇంతవరకు నే లేకుండా ఆయనగాని, ఆయన లేకుండా నేనుగాని ఒక్క సినిమా కూడా చూళ్ళేదు. ఏ సినిమా అయినా చూస్తే



కలిసి
చూడటం, లేదంటే ఊర్కోవడం. ఈ విషయం నిజంగా నాకెంత గర్వాన్నిచ్చేదో! అలాంటిది ఇన్ని సంవత్సరాల నా గర్వానికి తగిలిన వేటుకు తట్టుకోలేక పోయాను. బహుశా నా మొహం రక్త లేనట్లు పాలి పోయి ఉంటుంది. "కోపమొచ్చిందా!" అంటూ ఆయన అడుగుతుంటే మౌనంగా తలడ్డం ఊపుతూ, అతికష్టంగా బలవంతంగా చిరునవ్వు అద్దెకు తెచ్చుకోవడానికి ఎంత కష్టపడాల్సి వచ్చిందో! అయినా ఆయన మనసులో ఉండాలి. 'నాతో కలిసి ఉండాలి, కలిసి చూడాలి' అని గాని, నేను నాకు కోపం వచ్చిందని చెప్పి బలవంతాన ఆయనతో నాకిష్ట మయిన పనులు చేయించుకుంటే నాకు సంతోషం వస్తుందా! చెప్పి చేయించుకోవటం కన్నా దౌర్భాగ్యం మరొకటి ఉంటుందా!

అందుకే కావాలనే ఈరోజు తన పుట్టినరోజయినా మనసెందుకో విరక్తిగా, నిర్లిప్తంగా, నిస్సహాయంగా, నిరాశగా వుంది. ఎప్పటికీ ప్రతి సంవత్సరం తన పుట్టి నరోజుకి తను, 'ఆయనకి నా పుట్టినరోజు గుర్తుండి ఉండదు' అనుకునేది, ఏమాత్రం గుర్తున్నట్లు ప్రవ ర్తించని అతని ప్రవర్తన చూసి. కాని రాత్రి పన్నెండు గంటలకి గాఢనిద్రలో ఉన్న తన చెవిలో 'మెనీ మెనీ హాపీ రిటర్న్స్ ఆఫ్ ది డే' అని గ్రీటింగ్స్ చెప్తూ నులివె చ్చని అతని ఊపిరి స్పర్శకి పులకించిపోయేలా చేసేవారు. ఇక తెలతెలవారుతుండగానే నాకు తెలియకుండా ఆయన తెచ్చిన చీర, జాకెట్ ఇచ్చి కట్టుకొమ్మని, పుట్టినరోజు పాపాయి రెస్ట్ తీసుకోవాలని చెబుతూ వంట గదిలో నానా హంగామా చేసి చేయి కాల్చుకుని, చివరకు అన్నీ తనే చేస్తుంటే ఇబ్బందిగా మొహం పెట్టి గుడికి తీసుకెళ్ళే వారు. సాయంత్రం పిల్ల లతో సహ పిక్చర్‌కి తీస్కెళ్ళి, హోటల్‌లో భోజనం చేయించి, రాత్రికి పిల్లలు పడు కున్నాక తన ఒళ్ళో తల పెట్టుకుని ఎన్నిర కాల పాటలు పాడేవాడని...కానీ ఈరోజు తన పుట్టినరోజు ఆయనకి గుర్తుండి ఉంటే కదా? అలా గుర్తుచేయడం తనకిష్టం లేదు. పిల్లలు హాలిడేస్ అని నిన్ననే వాళ్ళ నాన్నమ్మ ఊరికి వెళ్ళారు. మరో పది రోజులవరకు రారు.

ఆయన క్రమశిక్షణ గతి తప్పితే, ప్రతీది..అస్తిత్వమే ప్రశ్నార్థకంలో పడు తుంది. ప్రొద్దుట్నుంచి ఉబికి వస్తున్న కన్నీరుని ఆపే ప్రయత్నం చేయనందుకు కళ్ళన్నీ వాచిపోయాయి. దూరంగా..'నీకోసమే కన్నీరు నింపుటకు నేనున్నానని, నిండుగ పలికే తోడొకరుండిన..అదే భాగ్యమూ..అదే స్వర్గమూ..' పాట వస్తుంది. నిజంగా రచయితలు మనసుల్ని చదువుతారో, మనుష్యుల్ని చదువు తారో..జీవితానికి అద్దం పడ్తాయి..అనుకున్నాను.

"సుజీ..సుజీ..!" ఉలిక్కిపడింది క్రింద తలుపు మూసి ఉండటంతో సరాసరి డాబాపైకి వచ్చాడు సూర్యతేజ. ఎందుకో చీకట్లో లేవాలనీ, పలకాలనీ అని పించలేదు.

"ఏమిటీ..చీకట్లో కూర్చున్నావు? సుజీ..నన్ను క్షమించు! మెనీ మెనీ హాపీ రిటర్న్స్ ఆఫ్ ది డే" అంటూ చేయి అందుకుని ముద్దాడారు. ప్చ్! స్పర్శకు పులకించే స్టేజి దాటిపోయినట్లు, నా శరీరంలో ఏ స్పందనా కలగడం లేదు. 'సారీ..క్షమించు' ఈ పదాల్ని ఎంత తేలిగ్గా వాడుతున్నారు. ఎన్ని రోజుల చిత్రహింస నైనా రెండే రెండు పదాలతో క్షమించమనడానికి ఎలా మనసొప్పుతుంది. 'హాపీ రిటర్న్స్' అంట. ఈ బ్రతుక్కి ఇంక అదొక్కటే తక్కువ. అయినా అదీ నిజమేనేమో! ఇదివరకు జరిగిన సంబరాల సంతోషపురోజుల్ని నెమ రేసుకోలేదూ. ఆ రకంగా ఇది మరపురాని రోజే. 'మళ్ళీ మళ్ళీ ఇది రాని రోజు' అని పాడుకోవాలేమో! అయినా...ఎందుకు ప్రతి సంవత్సరం ఇప్పట్నుంచి ఇలాగే జరుగుతుందిగా! ఎందుకురాదు. ప్రతీ సంవత్సరం మళ్ళీ వస్తుంది. మహా అంటే ఇప్పుడు బాధపడినంత సాంద్రత ఉండదేమో! సంవత్సరానికి కొంత చొప్పున తగ్గుతుందేమో!

"ఏమిటీ! బాధపడుతున్నావా? సారీ అంటున్నాగా! అసలు ఆఫీస్‌లో టెన్షన్ వర్క్ అవుతోంది. ఆ టెన్షన్‌లో నా మొద్దు బుర్రకి ఏదీ గుర్తుండి చావట్లేదు. ఏయ్..నిన్నే ...క్రిందకు వెళదాం రా!" అంటూ చేయి

**నామని సుజనాదేవి**

పుచ్చుకుని రేడియో తీసుకుని క్రిందకు తీసుకొచ్చారు. కాని నా మూడ్‌ని బాగుచేయలేకపోయారు.

"ప్లీజ్..సుజీ..నువ్వలా ఉండకు. నేను భరించలేను. ఇప్పటికే గుళ్ళన్నీ మూసేస్తారేమో కదూ! ఛ..నీ పుట్టిన రోజున ప్రతీ సంవత్సరం వెళ్ళే నీకిష్టమైన గుడికి కూడా తీసుకెళ్ళలేకపోయాను. రేపు తప్పక వెళదాం..నన్ను క్షమించు. చెప్పు నీకీ రోజేం గిఫ్టుకావాలి. నీకిష్టం వచ్చింది కోరుకో. నగలు..చీరలు..నీ ఇష్టం..ప్లీజ్ సుజీ..నీ మౌనంతో నన్ను బాధించకు. నువ్వు కోరుకోక తప్పదు. ప్లీజ్ మాట్లాడు.." చిన్నపిల్లవాడిలా అడుగుతున్నారు.

ఇక తప్పనిసరై ఆయన బాధ చూడలేక ఒక నిర్ణయానికి వచ్చాను. "నిజంగా ఏది కోరినా ఇస్తారా?"

"ఓ..ఎస్.." నేనడగడమే మహాభాగ్యమన్నట్లు ధీమాగా అన్నారు.

"అయితే మీరు వారం రోజులు లీవ్ పెట్టి రండి, మా అమ్మ వాళ్ళింటికి వెళదాం. ఈ వారం నన్నేం అడగొద్దు. అక్కడందరి ఇళ్ళు చుట్టి రావాలనుంది"

"ఎవరైనా నగలో..చీరలో కోరుకుంటారు. ఇలాంటి పిచ్చికోరిక కోరేదాన్ని నిన్నే చూస్తున్నాను. ఓ.కె. రేపే ఆఫీస్‌కెళ్ళి, కష్టమైనా ఎలాగైనా వారం రోజులు లీవ్ సాంక్షన్ చేసుకునొస్తాను" అంటూ మాట ఇచ్చారు.

'నిజంగానే నేను పిచ్చిదాన్ని. ఆత్మీయతానురాగాల ముందు చీరలు, నగలు పూచికపుల్లలని తెలిసిన పిచ్చిదాన్ని' అనుకున్నాను.

మరుసటిరోజు రాత్రి ఆయన రాగానే బైల్దేరి వెళ్ళాం. వెళ్ళినరోజు ఒకపూట మాత్రం ఆయనతో అమ్మా, నాన్నలతో కలిసి ఉన్నాను. ఆ మధ్యాహ్నం దగ్గర్లోని బాబాయ్ ఇంటికని వెళ్ళాను, ఆయన్ని ఒక్కడినే ఇంట్లో వదిలి. నాకు తెలుసు. అమ్మ ఆయనతో ఏం మాట్లాడలేదు. నాన్న కూడా పిచ్చాపాటి మహా అంటే గంట మాట్లాడతాడు. ఇక ఆయన 'హౌస్ అరెస్ట్'.

నాకు అమ్మ వాళ్ళింటికి తీసుకొచ్చి ఆయన్నలా బాధపెట్టడం ఇష్టం లేకపోయినా తప్పదు. నా మనసు బాధ ఆయనకు తెలిసేదెలా? ఆనందానికి ఐశ్వర్యం ప్రధానం కాదని, అంతకు మించినదేదో ఉందని అతనికెలా తెలియాలి? మనసును మెలిపెట్టిన సంఘటనలు, విషాదానందాల ఆటుపోట్లు, పంచుకుంటే బాధ తెలియదని, అందరూ ఉండి ఒంటరితనం అనుభవించడం ఎంత నరకమో అతనికెలా తెలియాలి? సెలవుపెట్టిన వారం రోజులు ఆయనతో మా ఇంట్లోనే ఉంటే నేననుకున్నట్లు నాతో బాగానే ఉంటారు, నాకూ సంతోషంగానే ఉంటుందేమో? కాని నేను పడిన బాధ ఆయనకు అర్థం కాదు. మళ్ళీ ఆఫీస్‌కి వెళ్ళగానే షరా మామూలే! ఆయన బిజీ..నా బాధలో నేను.

అందుకే ముందురోజు బాబాయ్ వాళ్ళింటికి ఒక్కదాన్నే వెళ్ళి రాత్రి తొమ్మిదిన్నర అయిపోయాక వచ్చాను. ఇంకా భోజనం చేయని ఆయనతో "బాగా బలవంతం చేస్తే నేనక్కడే భోంచేసానండి. మీరెందుకు రాలేదని మరీ మరీ అడిగారు. సారీ! నాకు నిద్రొస్తుంది. మీరు తినేయండి. నాన్న పిలుస్తున్నారు" అంటూ వెళ్ళి పడుకున్నాను. ఆయన మొహంలో ప్రతిఫలించిన బాధావీచికను చూసి, కష్టంగా మూలుగుతున్న మనసును బలవంతంగా జాలిపడకుండా నొక్కేసాను.

ఇలా చిన్నమ్మల ఇంటికని, మామయ్యల ఇంటికని ఐదు రోజులు ప్రొద్దుటే వెళ్ళి రాత్రికిగాని ఇల్లు చేరకపోయేదాన్ని. నాకు తెలుసు, నా ఆవేదన, తన ఈ ఐదురోజుల అనుభవంతో అర్థమయి ఆయనలో అణగారిన ప్రేమను వెలికితీసి ఆయనను మారుస్తుందని. అందుకే 'ఈ ఐదురోజులు నాకత్యంత ప్రీతిపాత్రమయిన ఆయన సాన్నిధ్యాన్ని కోల్పోతున్నానే ' అని మారాం చేస్తున్న మనసును అతికష్టంపై నచ్చజెప్పాను. అమ్మ నా ధోరణికి రెండవరోజే మందలిస్తే తగిన సమాధానం చెప్పి ఈ ఐదురోజులు ఓపిక పట్టమన్నాను.

ఆరవరోజు ప్రొద్దుటే ఆయనతో గుడికెళ్ళి వచ్చాక టిఫిన్ చేసి మామయ్య ఇంటికి వెళ్ళి ఎప్పటిలా రాత్రి వచ్చాను. నాన్న వచ్చి ఆయనను భోజనానికి తీసుకెళ్ళారు. ప్రతిరోజు రాగానే నిద్ర నటిస్తూ పడుకుంటే, నిజంగా కూడా నిద్రవచ్చేసేది. ఆయన మాత్రం మధ్యాహ్నం కాసేపు పడుకునేవారేమో! రాత్రి నిద్ర రాక, నిద్రపోయిన నన్ను డిస్టర్బ్ చేయలేక, కొత్తచోటులో ఇమడలేక మహా యాతన పడేవారు.

ఆరోజు అలాగే పడుకున్న నేను పాదాలపై వెచ్చటి స్పర్శకు కళ్ళు తెరిచాను. క్రింద కూర్చుని మంచంపైనున్న నా పాదాలను పెదాలతో సుతారంగా అద్దుతున్నారాయన. ఎందుకో..ఆగలేకపోయాను.

"ఛ..ఏమిటండీ" అంటూ కాళ్ళు లాక్కుని, ఆయన్ని తాకి కళ్ళకద్దుకోవటానికి చేయి చాపాను. కానీ నా చేయి మళ్ళీ నా కళ్ళకు అద్దుకోవటానికి వెనక్కిరాలేదు. ఆయన రెండు చేతులతో, ఇంక ఏడేడు జన్మలకైనా వదిలేది లేదు అన్నంత బలంగా పట్టుకుని, ఎక్కడ జారిపోతానో అన్నంత పదిలంగా గుండెలకు ఆన్చుకుని కలలోలా అంటున్నారు.

"సుజీ! నన్ను క్షమించు. నిజంగా నేనెంత మూర్ఖంగా ప్రవర్తించానో, సున్నితంగానైనా నాకు బాగానే బుద్ధి చెప్పావు. అసలు ఈ నాలుగు రోజులు నాలుగు యుగాలనిపించాయి నాకు. నీకిచ్చిన మాటకు కట్టుబడి నీకు అడ్డం చెప్పకూడదని ఊర్కున్నాను. కానీ నీ ఎడబాటు నాకు ఎంత నరకం? ఈ నాలుగు రోజులకే నేనింత బాధపడితే, రోజూ నువ్వెంత బాధ పడుతున్నావో అన్పించింది. టేబిల్‌పై నీ డైరీ కన్పించింది. నేనే నువ్వు నువ్వే నేను కదాని, తప్పని తెలిసినా, రోజూ తీరిక ఉండదుగా నీ ఆలోచనల్ని పంచుకోవడానికి, ఇలాగైనా పంచుకోవచ్చునను కుని నీ డైరీ తెరిచాను. నీ హృదయాన్నే పరిచినట్లుంది. నిజంగా నిన్నెంత క్షోభపెట్టాను. ఎన్ని అనుభూతుల్ని మిస్ చేసుకున్నాను. నీ అనుభవాన్ని, నా అనుభవంగా ఈ వారం రోజులు అనుభవించా. ఉద్యోగం, సంపాదనకంటే ముఖ్యం మనం నడిచిన ఏడడుగులు, మూడుముళ్ళు దగా చేయకూడదని, తెలుసుకున్నాను. భార్యాభర్తల్లో అగాధం పెరిగితే మిగిలేవి సంపదలు కాదు, ఆపదలు. అందుకే మన జీవితంలో నవ్వని రోజులన్నీ వృధా అయినట్లే. మనిషి అలవాట్ల కారణంగానే ఇతరులకు దూరం అవుతాడు. ఈరోజు నుండి మన పాత జీవితం ప్రారంభిద్దాం. నీ మనసు బాధపెట్టినందుకు నన్ను క్షమించవూ...నగలూ, నాణ్యాలు అడగలేదని నిన్ను పిచ్చిదాన్ననుకున్నాను. కానీ జీవితంలో అంతకుమించిన 'ప్రేమను' తెలియజెప్పావు, క్షమించాననవూ" అంటూ మంద్రస్థాయిలో 'ఇచ్చేసా నా హృదయం తీసుకో..' అన్నట్లు నా చేయిలో తన చేయి వేసారు. 'తథాస్తు' అన్నట్లు ప్రక్కగదిలోని దేవుని ముందున్న గంటలు గాలికి చిరుసవ్వడి చేసాయి. ఆయన మాటలకు నా మనసు దూదిపింజలా ఎక్కడికో వెళ్ళిపోతోంది.

అందమైన ఆకారముకన్న, ప్రేమే ఉంటే ప్రియురాలి చెవి జూకా కూడా ఉత్తేజాన్నిస్తుందట. అలాగే చాలా చిన్న చిన్న అనుభూతుల్ని కూడా మధురస్మృతులుగా మార్చుకుని ఆనందాన్ని పొందవచ్చు.

"ఛ..ఛ..అవేం మాటలండీ..ఈ నాలుగు రోజులు నేనే మీ మనసును కష్టపెట్టాను. క్షమించండి" అంటూ ఆయన గుండెలపై వాలిపోయాను. ప్రపంచంలోని శాంతి అంతా గూడుకట్టుకుని ఆయన గుండెల్లోనే ఉందేమో..అన్నట్లు ప్రశాంత మయింది నా మనసు.

